విపత్తుల నివారణపై మాక్‌డ్రిల్

నెల్లూరు : జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆదాని కష్ణపట్నం పోర్టులో రసాయన, జీవ, రేడియోలాజికల్, న్యూక్లియర్ సంఘటనలు జరిగినప్పుడు ఏ విధంగా ఎదర్కోవాలి వంటి విషయాలపై సంబంధిత అధికారులకు మాక్ డ్రిల్ నిర్వహించారు. గత మూడు రోజులు పాటు కోస్ట్ గార్డ్ ,పోలీసు ,ఫైర్ సెక్యూరిటీ, కస్టమ్స్, మరియు పోర్టు లోని సంబంధిత అధికారులకు శిక్షణ అవగాహన కల్పించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ మూడు రోజుల శిక్షణ అనంతరం మాడ్రిల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాని కష్ణపట్నం పోర్టు సి ఓ ఓ రాజన్ బాబు పాల్గొని ప్రసంగించారు జిల్లా విపత్తు నిర్వహణ అథారిట జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై. వీర శేఖర్,. ఎకెపిఎల్ హెడ్ కార్పోరేట్ అఫైర్స్ కె. ఎం. రామ్, హెచ్ ఆర్ డిజిఎం సిహెచ్.శ్రీ నివాసులు, సెక్యూరిటీ సీనియర్ మేనేజర్ కుమార్, పోర్ట్ అగ్నిమాపక శాఖ ఇన్‌ఛార్జ్ జి. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

మోగిన ఎన్నికల నగారా..!

-మే13న పోలింగ్
-జూన్ 4న ఫలితాలు వెల్లడి
-జిల్లాలో 20.39 లక్షల మంది ఓటరు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. దేశవ్యాపితంగా జరుగుతోన్న ఎన్నికల్లో ఎపిలో నాలుగో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 18-25 వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29న విత్‌డ్రా, మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాలు ఉంటాయి. జూన్ 6న ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఎన్నికల కోడ్ సుమారు రెండున్నర నెలలు అమల్లో ఉండనుంది. సుధీర్ఘ ఎన్నికల నిర్వహణతో అటు అధికారులు, ఇటు రాజకీయ పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. జిల్లాలో 20.39 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల నగరా మోగింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ హరినారాయణ్ తెలిపారు. జిల్లా వ్యాపితంగా 20,39,215 మంది ఓటర్లు గుర్తించారు. ఇందులో పురుషులు 9,97,908 మంది పురుషులు, 10,41,096 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లా వ్యాపితంగా 2460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌అమల్లోకి రావడంతో పోలీసులు చెక్‌పోస్టులు, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇంతపెద్ద ఎన్నికల ప్రక్రియ లేదని తెలుస్తోంది. రాష్ట్రంలో నాలుగో విడత ఎన్నికల జరగనున్నాయి. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 25న ముగుస్తుంది. 26న నామినేషన్లు పరిశీలిస్తారు. మే 13 పోలింగ్, జూన్ 4 ఫలితాలు ఉంటాయి. సుమారు 70 రోజుల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. రాజకీ యపార్టీలు ఇంత పెద్ద రాజకీయ ప్రక్రియతో హడలి పోతున్నారు. 70 రోజులు నాయకుల, కార్యకర్తలు ప్రచారం నిర్వహించడం, ఎన్నికల నిర్వాహణ తలకు మించిన భారంగా భావిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయపార్టీల బ్యానర్లు ఇతర ప్రచారం సామగ్రిని తొలగిస్తున్నారు.

వైసిపి అభ్యర్థులు ఖరారు..!

సిఎం జగన్ ప్రకటన - ఒక్కరే కొత్త ముఖం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి అభ్యర్థులు ఖరారయ్యారు. 2024 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఇడుపులపాయలో విడుదల చేశారు. నూతన జిల్లాలోని ఎనిమిది నియోజవర్గాల్లో ఒక్క కొత్త ముఖం మాత్రమే కనిపించింది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పేరును ప్రకటించారు. నెల్లూరు నగరం నుంచి ఖలీల్ అహ్మద్ కొత్తవారు కాగ అందరూ పాతకాపులే. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో అందరూ తమ రాజకీయ వ్యూహంలోకి వెళ్లారు. నెల్లూరు జిల్లా వైసిపి అభ్యర్థులు అందరూ ఊహించినవారినే ప్రకటించారు. ముఖ్యమంత్రి విడుదల చేసిన వారిలో నెల్లూరు రూరల్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగరం ఖలీల్ అహ్మద్, కోవూరు నల్లపరెడ్డి ప్రసన్నకు మార్‌రెడ్డి, సర్వేపల్లి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి మేకపాటి రాజారెడ్డి, కందుకూరు బుర్రా మధుసూధన్‌యాదవ్, కావలి రామిరెడ్డి ప్రతాం కుమార్‌రెడ్డి, పేర్లు ఖరారుచేశారు. ఎంపిగా విజయ సాయిరెడ్డి పేరు ప్రకటించారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

అధికారులు సమ్వయంతో పనిచేయాలి - కలెక్టర్ ఎం. హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని అందరూ పాటించాలని కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ మేరకు దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ ప్రక్రియ జరగనుండగా, మన రాష్ట్రంలో నాలుగో విడతలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఏప్రిల్ 25 నామినేషన్ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటీని, నామినేషన్ల విత్ డ్రాకు ఏప్రిల్ 29 చివరి తేదీగా చెప్పారు. మే 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరుగుతుందని, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఏప్రిల్ 18న ఫామ్-1 విడుదల చేస్తూ ఏయే ప్రాంతాల్లో నామినేషన్లు స్వీకరిస్తామో తెలియజేస్తామన్నారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా ఉంటారని, కందుకూరు అసెంబ్లీ నియోజక వర్గానికి సబ్ కలెక్టర్, కావలి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆర్‌డిఒలు, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గానికి జాయింట్ కలెక్టర్, నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి మున్సిపల్ కమిషనర్, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్‌డిఒ నెల్లూరు, సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ కలెక్టర్ తెలుగు గంగ, ఉదయగిరి నియోజకవర్గానికి ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వెంకటగిరి నియోజకవర్గానికి తిరుపతి సబ్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు సెలవు దినాల్లో మినహా అన్ని రోజుల్లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సెక్యూరిటీ డిపాజిట్ గా 25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 50 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నామినేషన్‌తో పాటు అఫిడవిట్ ను అభ్యర్థులు ఫామ్ 26 ద్వారా అందజేయాల్సి ఉంటుందని, రిటర్నింగ్ అధికారి సమక్షంలో ప్రమాణం చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ వేసే సమయంలో 100 మీటర్ల దూరం వరకే మూడు వాహనాలకు అనుమతి ఉంటుందని, ఆర్‌ఒ చాంబర్లో అభ్యర్థితోపాటు మరో నలుగురికి ప్రవేశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో 2460 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, నెల్లూరు రూరల్ సంబంధించి 10 ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్లో ఏర్పాటుకు ఈసి అనుమతి కోసం ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 2039215 మంది కాగా, పురుషులు 997908 మంది అని, స్త్రీలు 1041096, ఇతరులు 211 మంది అని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 53 ఎంసిసి బృందాలు, 78 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 81 ఎస్ఎస్‌టి బృందాలు, 20 విఎస్‌టి బృందాలు నేటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి పై తమ విధులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీవీ ఛానళ్లు, సోషల్ మీడియా, వాట్సాప్, ఇంస్టాగ్రామ్, యూట్యూబ్ ఛానల్ మొదలైన ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన మాధ్యమాలు ప్రసారం చేసే అభ్యర్థుల ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్ లు, వాయిస్ మెసేజ్ లను ప్రసారం చేసే ముందు ఎంసిఎంసి కమిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నెల్లూరు కలెక్టరేట్ లోని డిఆర్‌డిఎ కార్యాలయం మిద్దె పైన సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత్రికేయులు ఎటువంటి ఫేక్ వార్తలను ప్రసారం చేయొద్దని ప్రసారం చేసే ముందు వార్తలకు సంబంధించి ఏదైనా సందేహం ఉన్నచో మీడియా సెంటర్లో 24 గంటలు సమాచార శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని, వారి ద్వారా పూర్తి వివరాలు తెలుసుకొని వార్తలు ప్రచురించాలన్నారు. పత్రికల్లో చెల్లింపు వార్తలు (పెయిడ్ న్యూస్) ప్రచురించొద్దని, పెయిడ్ న్యూస్ పై ఎంసిఎంసి ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ లవన్న, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, డిపిఆర్‌ఒ మోహన్ రాజు, ఇంజినీర్ కిషోర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

న్యాయవాదుల సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో జరుగుచున్న వర్క్ షాప్‌లో పలువురు పాల్గొన్నారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు , ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు, బెజవాడ కష్ణయ్య, వి.శ్రీధర్ నాయుడు, సి. హెచ్. హరిక్రిష్ణ, ఉన్నం మారుతీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, హనుమానాయక్, మన్నెం సత్యనా రాయణ, బొడ్డు భాస్క రరావు, శివరామకష్ణ, యం.గంగరాజు,గల్లా గాంధీ ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణ పరిధిలోని కోటారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ , సంకల్ప హాస్పిటల్ , తూర్పు వడ్డిపాలెం ల లో అర్బన్ హెల్త్ సెంటర్ , ఏరియా హాస్పిటల్ కందుకూరు స్కానింగ్ సెంటర్లను ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ యం ప్రియం వద శనివారర ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ రికార్డులను ఆమె పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం , ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని అలాంటి సెంట ర్లపై పి సి పి ఎన్ డి టీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఎం పి హెచ్ ఓ షేక్ ఆరిపుల్లా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -ఉలవపాడు : ఉలవపాడు శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శనివారం శ్రీ సాయి పాఠశాల లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 18వ తేదీ న జరుగు పబ్లిక్ పరీక్షల్లో ప్రశాంతంగా జర జరగాలని కరస్పాండెంట్ కె .వి శేషమ్మ పేర్కొన్నారు. వైఎస్ఆర్ టీచర్స్ రాష్ట్ర కార్యదర్శి జాలి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ మౌనిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడు పంచాయతీలోని హరిజనపాలెం, చైతన్య నగర్, చిన్న పల్లెపాలెం, అలగాయపాలెం గ్రామాలలో శనివారం టిడిపిలోకి చేరికలు జరిగాయి. నాగేశ్వర రావు వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. 'మీ అందరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, రాబోయే ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేస్తామని, ఎప్పుడు ఏ కష్టం వచ్చినా తను నేరుగా కలవచ్చని హామీ ఇచ్చారు. ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగల్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, చిట్టా బంగారు రెడ్డి మెట్ట శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

'పది' పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి నెల్లూరు

రాష్ట్రంలో 18 నుంచి జరుగుతున్న 'పది' పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండా. శ్రీ హర్ష ఒక ప్రకటనలో కరారు. పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి అని ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకొని ప్రతి పరీక్షా కేంద్రంలోని రూమ్స్ లో ఫ్యాన్లు ఏర్పా ట్లు చేయాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో వెలుతురు లేని గదులలో లైట్లు ఏర్పాటు చేయాలనాన్రు. మెడికల్ ఫస్ట్ ఎయిడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములకు నివాళి

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు :అమరజీవి పొట్టి శ్రీరా ములు చేసిన త్యాగం భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని డైకస్ రోడ్ లోని క్యాంపు కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాసి కావడం, ఆయన పేరుతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు రావడం జిల్లా వాసులుగా మనకెంతో గర్వకారణమన్నారు. ఆ యన స్ఫూర్తితో దేశంలో ఎన్నో సరికొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఆయన ప్రాణత్యాగం పలితమే నన్నారు. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని సుదీర్ఘ కాలం పాటు ఉద్యమం చేపట్టి, నిరాహార దీక్షతో ప్రాణాలను పణంగా పెట్టి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన గొప్ప వ్యక్తి, తెలుగు వారు జీవితాంతం రుణపడి ఉండాల్సిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆ మహనీయుని ఆదర్శాలను గౌరవిస్తూ, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కషి చేయాలని, అందరూ కలిసిమెలిసి ఐక్యమ త్యంగా ఆయన సాధించిన రాష్ట్రాన్ని మరింత అభివద్ధి పథంలో నడిపించేందుకు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

పలుచోట్ల జయంతి కార్యక్రమాలు

అమరజీవి సేవలు వెలకట్టలేనివి : కలెక్టర్

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనీరతి వెలకట్ట లేనిదని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరా ములు జయంతి సందర్భంగా శనివారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలోగల పొట్టి శీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరా ములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాల న్నారు. దేశ చరిత్రలో ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు నేటికీ ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహోన్నత వ్యక్తి "అమరజీవి" శ్రీ పొట్టి శ్రీరాము లని ఎస్ పి డాక్టర్ కె తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. శనివారం ఎస్ పి కార్యాలయంలో జిల్లా వాసి "అమరజీవి" శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పుర స్కరించుకుని ఆ మహనీయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కందుకూరు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణం పెద్ద బజారులో గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి వ్రాలవరాలవేని కందుకూరు నియోజకవర్గ టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు నివాళులర్పించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మురారిశెట్టి వెంకట సుబ్బారావు కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కందుకూరులో..

ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రస్తుతం రాజకీయ పరిణామాలు దిగజారుతున్న క్రమం లో ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన పాలన అందించేందు కు సమర్థ నాయకత్వం ఎంతో అవసరమని, ఆ దిశగా రానున్న ఎన్నికలలో ఓటర్లు ఆలోచించాలని సామాజిక కార్యకర్త, విద్యా వంతుడు కమతం మస్తాన్ పేర్కొన్నా రు. రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్లకు అ వగాహన కల్పించేందుకు శనివారం మస్తాన్ తోటపల్లి గూడూరు మండలం కోడూరులో పర్యటించారు.

బూత్ కన్వీనర్లకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

రానున్న ఎన్నికల్లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవ ర్ధన్ రెడ్డికి భారీ మెజారిటీని బహుమతిగా ఇవ్వాలని స చివాలయాల కన్వీనర్ తలమంచి సురేంద్ర బాబు సూ చించారు. శనివారం తోటపల్లిగూడూరు మండలం వర కవిపూడి గ్రామ సచివాలయంలో బూత్ కన్వీనర్లు, గ హసా రధులు వాలంటీర్లతో సమావేశం జరిగింది. సర్పం చ్ ఇసనాక రమేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావే శంలో సురేంద్ర బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అ యన మాట్లాడుతూ రెండోసారి అధికారమే లక్ష్యంతో జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రా ష్ట్రంలోని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, పా ల్గొన్నారు.

'బుర్రా'కు టికెట్ ఖరారు..!

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా బుర్రా మధుసూదన్ యాదవను ఆ పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ఈ ప్రకటనతో కందుకూరు నియోజకవర్గంలోని వైసిపి శ్రేణుల్లో రెండు వారాలుగా సాగుతున్న పుకార్లకు తెలపడింది. కనిగిరి శాసనసభ్యుడిగా వున్న మధుసూదన్ యాదవ్ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్తగా వైసిపి ఇంతక ముందే ప్రకటించిన విషయం తెలిసిందే.సమన్వయకర్తగా ప్రకటించినప్పటికీ చివరకు పార్టీ అభ్యర్థుత్వం మానుగుంట మహీధర్ రెడ్డికే దక్కుతుందని వైసిపి శ్రేణుల్లో ఇన్నాళ్లుగా ప్రచారాలు సాగాయి ఆ మధ్యలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థత్వం గానీ, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి తత్వం కానీ మహీధర్ రెడ్డికి లభించునున్నదని ప్రచారాలు ఉరకలెత్తాయి. ఇంటూరి నాగేశ్వరరావును టిడిపి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పుకార్లకు తెలపడింది. ఆ వెంటనే వైసిపి అభ్యర్థితత్వం మానుగుట మహీధర్ రెడ్డికే లభించి తీరు తుందనే నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో మహీధర్ రెడ్డి అభిమానులు ఆత్మీయ సమావేశాల పేరట కొద్దిపాటి సభలు జరిగాయి. . బుర్రా అభ్యర్థిత్వపై ఇప్పుడు అధికారికంగా ప్రకటన రావడంతో ఇప్పుడు వైసిపి శ్రేణులు ఎన్నికల బరిలోకి ఉత్సాహంగా దూకే అవకాశం కనిపిస్తుంది.

బుర్రా మధుసూదన్ యాదవ్

వేలం నిర్వహిస్తున్న అధికారులు

తలనీలాల కోసం వేలం నిర్వహణ

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో 2024-25 సంవత్సరమునకు తలనీలాలు పోగు చేసుకొను హక్కునకు సంబంధించి శనివారం వేలం నిర్వహించారు. ఈ పాటలో గరుడ ఎంటర్ప్రైజెస్, తిరుపతి వారు 1,44,99,999/- లకు హెచ్చు పాట పాడి పాటను దక్కించుకున్నారు. వేలం పర్యవేక్షకులు వై. బైరాగి చౌదరి, ఉప కమిషనర్ మరియు కార్య నిర్వాహణాధికారి. కె.బి శ్రీనివాసరావు తెలియజేశారు.

జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలోని 5వ వార్డు బృందావనం కాలనీలో టిడిపి జెండాను కందుకూరు నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శనివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు గారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ కషి చేస్తుందన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు దాసరి ప్రమోద్ స్థానిక నాయకులు గేరా నరేష్ పాలేటి కోటేశ్వరరావు జంగాల రాఘవ ఉంద్రాళ్ళ సతీష్ జంగాల వెంకటరావు కసుకుర్తి అక్షయ్, శీలం ప్రదీప్, జమ్మలమడుగు అనురాధ, గుడిపూడి యశోద, ముప్పాళ్ళ పూజిత నాయకులు చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, కూనం నరేంద్ర ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలోని పొట్లూరు గ్రామంలో అడవి పందుల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగలు తగిలి అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు (60) అనే రైతు శనివారం ఉదయం దుర్మరణంచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పంట పొలాల్లోకి అడవి పం దులు రాకుండా ఉండేందుకు వీలుగా గ్రామస్తులు కొందరు విద్యుత్ తీగ ఏర్పాటు చేశారు. విషయం తెలియని నాగేశ్వరరావు అనే రైతు తన పొలానికి నీరు పెట్టుకునేందుకు వెళ్తుండగా కాలికి విద్యుత్ తీగ తగిలి అక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు కొం దరు చూసి తెలియజేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించి శవాన్ని ఇంటికి తీసుకొని పోయారు.

శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి -నెల్లూరు :నారాయణ వైద్యశాలలో అభినందన్ (12) అనే బాలుడికి ఇ.ఎన్.టి శస్త్రచికిత్స విజయ వంతంగా నిర్వహించామని నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణ హాస్పిటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ చికిత్స కు సంబం ధించిన వివరాలు వెల్లడించారు. పొదలకూరు ప్రాంతానికి చెందిన అభినందన్ 12 ఏళ్ల బాలుడు గత ఆరు నెలలుగా ముక్కు ద్వారా ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతూ వచ్చాడని తెలిపారు. ఇ.ఎన్.టి వైద్యులు డాక్టర్ .హిమజ మాట్లాడుతూ బాలుడిని క్షుణ్ణంగా పరిశీలించి, అరుదైన జబ్బుగా నిర్ధారించామని తెలిపారు. శస్త్రచికిత్స అవసరమని, అత్యంత అధునాతన పరికరాలు ద్వారా శస్త్రచికిత్స నిర్వహిం చామన్నారు.ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. ఇ.ఎన్.టి విభాగాధిపతి డాక్టర్ కష్ణచైతన్య మాట్లాడారు.

ఉదయగిరిలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఘన నివాళులర్పిస్తున్న విద్యార్థులు

శ్రీ పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-ఉదయగిరి

స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో శనివారం ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి.గోపికృష్ణ ముందుగా శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా ముద్దుబిడ్డ, త్యాగశీలి శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు అన్నారు. ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగా మనకు ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని విద్యార్థులకు తెలిపారు. సమావేశంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.కిషన్‌తేజ్, అధ్యాపక, అధ్యాపకేతర, సహాయకసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ తాజ్‌మసూర్ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంపూర్ణమ్మ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మండల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం అవరణంలో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శనివారం ఆర్యవైశ్య సంఘం నాయకులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణకు శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గిరిబాబు, రాజా, వేమా మల్లికార్జునరావు, ప్రభాకర్, రామారావు, రాంబాబు, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-జలదంకి

బోగోలు మండలం విశ్వనాథరావు పేట పంచాయతీ ఇడమీంపేటలో టిడిపికావలి ఎంఎల్ఎ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి, పార్లమెంట్ సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మద్దతుగా ఇంటింటి ప్రచారం టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డికి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపటి సుధీర్ బాబు, మండల మైనార్టీసెల్ అధ్యక్షులు అష్రఫ్ బాషా, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు లక్ష్మయ మాధవరావు, మండల యువత ప్రధాన కార్యదర్శి పొట్లె హరిబాబు, నాటకరాల రంగయ్య, విశ్వనాధరావుపేట పంచాయతీ వార్డు సభ్యులు చిలక జానకి రామయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు ఖలీల్, బంక జయరాజు, కత్తుల నరసింహారావు, దస్తగిరి షేక్, మండల మైనార్టీ మహిళా నాయకురాలు మల్లిక, మైనార్టీ నాయకులు అఖిల్, కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..

ప్రజాశక్తి-కొండాపురం

తనకు ఒక అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని ఉదయగిరి టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని సాయిపేట పంచాయతీలోని ఇసుకపాలెం గ్రామంలో శివాలయ ఆధ్వర్యంలో సెంటిమెంటుగా తన మొదటి ప్రచారాన్ని ప్రారంభించారు. దళిత గ్రామంలోని రామాలయంలో పూజలు చేసి ప్రచారం లాంఛనంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో కాకర్ల విజయం ఖాయమన్నారు. తనను నాలుగుసార్లు ఆదరించి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని, ఆయనలో కొంతసమయం చేయాలని గానూ కాని జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క పని కూడా చేయలేక పోయానన్నారు. పనులు జరగాలంటే ముఖ్యమంత్రి మంచివాడై ఉండాలని నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ఆయనను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీరు రోడ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని, సురేష్ అవకాశం ఇచ్చి గెలిపిస్తే టిడిపి అధికారంలోకి రాగానే గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరగలేదని, అధిక ధరలు అధిక పన్నుల పాలనతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా వైసిపి నాయకులు అరాచకాలకు పాల్పడి ఎప్పుడూ లేని విధంగా ఇసుక మట్టి మాఫియాలతో పాటు అనేకమైన దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. జరగనున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపికి అండగా ఉండి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి చేయాలని, ఉదయగిరి నియోజకవర్గంలో తనకు ఎంఎల్ఎ అభ్యర్థి ఓటు వేసి అలాగే ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీ నరసింహం, మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, మాజీ జెడ్‌పిటిసి దామా మహేశ్వరరావు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గణ్ణి రామకృష్ణ, ఏరా కృష్ణయ్య, నియోజకవర్గం 18మండల టిడిపి శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

18నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి-ఉదయగిరి : సోమవారం నుండి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఎంఇఒ-1 షేక్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. శనివారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 18వ నుండి అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలోని పాఠశాలలు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహిస్తామన్నారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం 1 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు.

ఎంఇఒ మస్తాన్‌వలీ

ప్రజాశక్తి-సీతారామపురం : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రేపటి నుండి అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలలోని పాఠశాలలు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులను నిర్వహించాలని ఎంఇఒ షేక్.మస్తాన్ వలీ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం 1గంట నుండి 5 గంటల వరకు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తున్నామన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, ప్రయివేట్ పాఠశాలలో సోమవారం నుంచి ఒంటిపూట బడులు జరుగుతాయని ఎంఇఒలు ఎం.బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పాఠశాలలు పనిచేస్తాయని వారు తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరుగుతాయన్నారు.

పోషణ పక్వాడ్

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని కృష్ణంరాజు పల్లిలో అంగన్ వాడీ సూపర్‌వైజర్ కళావతి ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోషణ విలువలు గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సౌందర్య, ప్రసన్న, అనూష, భాగ్యమ్మ, రత్నమ్మ, తదితరులున్నారు.

పంట కాలువను కాపాడాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో కొందరు ఆక్రమణదారులు పంట కాలువను ఆక్రమించి పంట పొలాలను బీడు భూములుగా మార్చేందుకు పన్నాగం పన్నారని, వెంటనే వంట కాలువ ఆక్రమణలను తొలగించాలని జిల్లా కౌలు రైతుసంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు చెరువు పెద్ద అలుగు కాలువ ఆత్మకూరు చెరువు నిండిన తరువాత మిగులు జలాలను వాసిలి చెరువుకు పంపి నింపే విధంగా రాయల కాలం నాడే గొలుసుకట్టు చెరువుల నిర్మాణం మన పూర్వీకులు దూరదృష్టితో ఏర్పాటు చేశారని తెలిపారు. సుమారు 450 సంవత్సరాల క్రితమే ఈ ఏర్పాటును రైతుల కోసం వ్యవసాయంలో టెక్నాలజీని ఉపయోగించిన పరిస్థితులు మనం గమనించవచ్చన్నారు. కానీ ఆత్మకూరు చెరువుకు చెడ్డ రోజులు దాపురించాయనీ, చెరువు పంట కాలువల ఆక్రమణకు గురికావడం వాటిలో ప్లాట్లను ఏర్పాటు చేసుకోవడం, అమ్ముకోవడం వంటివి జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం సాధారణంగా మారిపోయిందని ఆరోపించారు. గతంలో చెరువు నీటి సంఘాలు ఎంపికై వాటి ద్వారా చెరువు కాలువల ఆలనాపాలన ప్రభుత్వం నిర్వహించేది ప్రస్తుతం చెరువు సంఘాలు లేకుండా పోయాయన్నారు. నీటి నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారిపోయి, రైతులు పంటలు పండించుకునే పరిస్థితులు లేకుండా

ఆలయ నిర్మాణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రాంతం

పోయాయని తెలిపారు. ఇదే అదునుగా భావించిన రియల్టర్లు వంటకాలవల ఆక్రమణ పూర్తయిన తరువాత మిగులు జలాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలుగు కాలువలను పూర్తిచేసి ప్లాట్లను చేసి విక్రయించడం స్పార్క్‌సిటీ యాజమాన్యం చేపట్టిందని తెలిపారు. సుమారు 2ఎకరాల 70సెంట్ల భూమిని ఆక్రమించి ప్లాట్లు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం సర్వే జరిపి సదరు ఆక్రమణలను తొలగించాలని ఆదేశించిందన్నారు. దానిపై ఆత్మకూరు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే మళ్లీ చేసి ఆక్రమణలు జరిగాయని, రైతుసంఘం ఫిర్యాదు మేరకు నివేదికను కూడా ఇచ్చారని తెలిపారు. సదరు ఆక్రమణలను తొలగించేందుకు నిధులు అవసరమవుతాయని సదరు నిధులు రాగానే ఆక్రమణలను తొలగిస్తామని రాత మూలకంగా తెలియబరిచారు. ఇది గమనించిన రియల్ ఎస్టేట్ యజమాని స్మార్ట్‌సిటీ లేఅవుట్‌లో అలుగు కాలువలో ప్లాట్లను కొనిన యజమానులతో చర్చించి అలుగు ప్రారంభంలో ఆలయ నిర్మాణం చేసుకోండని నిధులు సమకూర్చినట్లు కూడా ప్రచారం ఉందని తెలిపారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న విధంగా ఆలయ నిర్మాణంతో లేఅవుట్ యజమాని రక్షించబడతా డని, వాగులో ప్లాట్లను కొన్న యజమానులు కూడా రక్షింపబడతారని అర్థమవుతుందన్నారు. సుమారు 1000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఈ మిగులు జలాల పంట కాలువ పూడిపోయి రైతాంగం భవిష్యత్తులో తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడతారనేది మాత్రం మర్చిపోయారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి సదరు ఆలయ నిర్మాణాన్ని ఆపి మిగులు జలాల కాలువను రక్షించాలని ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం డిమాండ్ చేస్తుందని, ఈ కాలువ ఆక్రమణలపై లోకాయుక్తకు ఫిర్యాదు కూడా చేసి ఉన్నారని తెలిపారు. ఈ పరిస్థితులను అన్నింటినీ పరిగణలోకి తీసుకొని సదరు కాలువకు రక్షణ ఏర్పాటు చేయాలని భవిష్యత్తులో 3,4,5 వార్డులు ఈ కాలువ కూడినందు వల్ల అవకాశాలున్నాయని, 2020వ సంవత్సరంలో ఆత్మకూరులో కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతమంతా జలమయమైన పరిస్థితిని చూశామన్నారు. రియల్ ఎస్టేట్ యజమానుల ఆగడాలకు ఆత్మకూరు పట్టణ ప్రజలు రైతాంగం బలి కావలసిన పరిస్థితులు మనం ఎదుర్కోవాలన్నారు. ఆత్మకూరు రైతాంగం ఈ విషయాలని అర్థం చేసుకొని భవిష్యత్తులో పంట పొలాలను బీడు భూములుగా మారే అవకాశం ఉంది కాబట్టి అందరూ కదిలి అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేయాలని రైతుసంఘం నాయకులు కోరారు.

టిడిపిలోకి మాజీ ఎంఎల్ఎ 'వంటేరు'

ప్రజాశక్తి-కావలి

చంద్రబాబు హయాంలో చేరుతున్న వంటేరు

ఉండవల్లి లోని చంద్ర బాబు నివాసంలో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కావలి మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్ రెడ్డి టిడిపిలో చేరారు. గతంలో వంటేరు వేణుగోపాల్ రెడ్డి టిడిపిలో ఎంఎల్ఏగా మంచిగా పని చేశారని చంద్రబాబు గుర్తు చేశారు. అనంతరం వంటేరు మాట్లాడుతూ టిడిపిలో చేరడం చాలా ఆనందంగా ఉందని, గతంలో తనకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది కూడా టిడిపినే అని తెలిపారు. తాను తెలుగుదేశం పార్టీలో చేరటానికి ముఖ్య కారకులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని అన్నారు. ఆయన కోసం కావలి, ఉదయగిరి నియోజకవర్గంలో శక్తి వంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వేమిరెడ్డి విజయం తథ్యమన్నారు. అలానే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కూడా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన సమక్షంలో మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు టిడిపి యువత ఆధ్వర్యంలో కోనేరు నుండి బైక్ ర్యాలీ ప్రారంభించారు. బిట్రగుంట వరకు ర్యాలీ నిర్వహించి వెంకటేశ్వర స్వామికి 101 కొబ్బరకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. బీద గిరిధర్ మాట్లాడారు. కార్యక్రమంలో మనోజ్, బండి శ్రీనివాసరెడ్డి, అరగల రమణయ్య, కృష్ణ చైతన్య, దయాకర్, కావలి జగన్, నజీర్ బాషా, కార్యకర్తలు, టిడిపి యువత పాల్గొన్నారు.

కావ్య క్రిష్ణారెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

తాళ్లపాలెంలో టిడిపి పర్యటన

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీ, అన్నగారి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో శనివారం టిడిపి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. రెండు పంచాయతీల్లోని ప్రతి గ్రామానికి వెళ్లిన ఆయన స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో పాటించవలసిన విధానాలను వివరించారు. ఎలాంటి మనస్పర్థలు లేకుండా ప్రతి నాయకుడు పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలని తెలిపారు. తమ గ్రామానికి వచ్చిన తమ నేతకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. యువత బాణా సంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కావలి రూరల్ మండలం తాళ్లపాళెం గ్రామానికి చెందిన వీరయ్య, మదన్ గోపాల్ రెడ్డి, పాలా మల్లికార్జున, పాలా శ్రీనివాసులు, జయంత్ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన మామిడి వెంకట రమణయ్య, చెంచంగారి పోతురాజు, ఆవుల మల్లికార్జున, ఆవుల నాగరాజు, కోడూరు సోమయ్య, మామిడి సోమయ్య ఆధ్వర్యంలో ఆవుల నాగేశ్వరరావు, చెంచంగారి కొండయ్య, ఆవుల కొండయ్య, చెంచంగారి శ్రీను, ప్రలయకావేరి తిరుపతి, ఆవుల సుబ్బరాయుడు ఆవుల నాగరాజు, తదితరులు భారీ ఎత్తున వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన వాయిళ్ల గోవిందు, వాయిల శివయ్య, వాయిల వెంకటేశ్వర్లు, ఆవుల గోపి, ఆవుల రాముడు, ప్రళయకావేరి యానాది, ఆవుల సుబ్రహ్మణ్యం, అప్పాడి మునలయ్య, తదితరులు భారీ ఎత్తున వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కావ్య క్రిష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, మండల పరిశీలకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, టిడిపి - జనసేన జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 380పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా, 377పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వీటిలో 1సిఆర్ కాగా అధిక బరువుతో ఉన్న 02 పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠధర 230కాగా కనిష్ఠ ధర రూ.227, సగటు ధర రూ.229.87 నమోదు కాగా, వేలంలో 13మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

రాష్ట్రంలో అధోగతి పాలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో వైసిపి అధోగతి పాలన కొనసాగుతుందని, దోచుకోవడం.. దాచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మాజీ మంత్రి, వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని రవి తేజ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సమరభేరి ప్రారంభం అవుతుందని దానికి నాంది త్రిముఖ నాయకత్వం నేడు చిలకలూరిపేట దగ్గర జరిగే ప్రజాగళం మహాసభ శ్రీకారం చుడుతుంద న్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ పాలన ప్రజాస్వామ్య ఖూని భారత రాజ్యాంగాన్ని క్షీణింప చేయడం, అవినీతి, అక్రమ సంపాదన వీటన్నింటికీ శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టడానికే మూడు పార్టీల కలయికతో నేడు సభ ఏర్పడుతుందన్నారు. ఆ సభలో భారతదేశ ప్రధానమంత్రి బిజెపి నాయకులు నరేంద్ర మోడీ నాయకత్వంలో అలాగే టిడిపి జాతీయ నాయకులు అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జనసేన జాతీయ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమిష్టి కృషితో సభను విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రం మార్పు చేయడానికి, అలాగే ఈ రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గపు పరిపాలన అంతమొందించడానికి ముగ్గురు నాయకుల సమిష్టి ఆలోచనలతో కూడా వాళ్లు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఇటువంటి అవినీతి అక్రమ సంపాదన ఇవాళ మాఫియా గ్యాంగ్‌గా మారి ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని ఏ విధంగా దోచుకుంటున్నారో.. వాటన్నింటినీ కూడా ప్రజల ముందు పెట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి రాజ్యాంగ పరిరక్షణను ప్రతిఒక్కరూ కూడా కంకణబద్ధులై నేడు జరిగే సభను దిగ్విజయం చేయడానికి మహామహా నాయకులందరూ కూడా వస్తున్నారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇది ఒక చారిత్రక ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. రాబోయే పార్లమెంటు, శాసనసభ ఎన్నికలలో స్పష్టమైన నిర్ణయానికి ప్రజలకు సంకేతంగా నిలవబోతుందని తెలియజేస్తున్నానన్నారు. చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్‌లో తమతో మాట్లాడారని, కాన్ఫరెన్స్‌లో వారు చిన్న వెసులుబాటు ఇచ్చారని తెలిపారు. గతంలో అందరమూ సభకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. సభలో ఇచ్చే సందేశాన్ని ప్రజలందరికీ వివరించాలని తెలిపినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రచార ప్రణాళిక ఏర్పాటు చేసుకొని మండలాల వారీగా, గ్రామాల వారీగా మున్సిపల్ పరిధిలో వార్డుల వారీగా నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల ప్రచారం శ్రీకారం చుట్టామన్నారు. దానికి పార్లమెంట్ సభ్యులు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పార్టీ నాయకులు, అబ్జర్వర్లు ఆత్మకూరు పార్టీ నాయకత్వం అంతా కలిసి ఆ కార్యక్రమం రూపొందించుకొని కార్యాలయం ప్రారంభంతోనే ఎన్నికల ప్రణాళికను ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అబ్జర్వర్ బుల్లెట్ రమణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు, కేత విజయభాస్కర్ రెడ్డి, సుంకర పెంచలయ్య చౌదరి, టిడిపి అధికార ప్రతినిధి చంద్రా వెంకటసుబ్బ నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మీరా మొహిద్దీన్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న వెంకటగిరి ఎంఎల్ఎ రామనారాయణరెడ్డి

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి రూరల్

మండల పరిధిలోని అన్నగారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను శనివారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. పల్లె సీమలే దేశానికి పట్టు కొమ్మలని భావించిన గాంధీజీ ఆశయ సాధనకు సిఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎంపి అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, హ్యాట్రిక్ ఎంఎల్ఏగా తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోనే కావలి నియోజకవర్గాన్ని నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అన్నగారిపాలెం సర్పంచి గోళ్ళ సుప్రియ, వైసిపి నాయకులు గోళ్ల కిషోర్, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలం బొమ్మవరం గ్రామం లో శనివారం ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మండల సచివా లయ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పెయ్యల సంపూర్ణమ్మ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి మాట్లాడుతూ మండలంలో బొమ్మవరం కేంద్రంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి రెండు కోట్ల 60 లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారని తెలిపారు. నాలుగు రోజుల నుంచి పనులు జరుగుతున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంఎల్ఓ మధుసూదన్ రెడ్డి, వైసిపి నాయకులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అదనపు గదులు ప్రారంభం

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రమైన అల్లూరు జెడ్‌పిపి హై స్కూల్ (సుబ్బయ్య బడి) అదనపు గదులను శనివారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనతరం మూడోసారి గెలిచిన అనంతరం జెడ్‌పిపి స్కూల్‌ను జూనియర్ కాలేజీగా మారుస్తామన్నారు. మన్నెమాల సుకుమార్ రెడ్డి, నీలం సాయి కుమార్, దర్శిగుంట శశి రేఖ, రమేష్ రెడ్డి, దాసరి పోలయ్య, ఇసుకపల్లి సర్పంచి రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-మర్రిపాడు : వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు, సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం 2024 ఎన్నికల్లో వైసిపి తరపున ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డిని ప్రకటించడంతో పలువురు నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. శనివారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో విక్రమ్‌రెడ్డిని కలిసి మిఠాయి తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విక్రమ్ రెడ్డి విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలను డిప్యూటీ తహశీల్దార్ గిరీష్ శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథక తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్ మంగుపల్లి, ఎగువపల్లె గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ వసతులు గురించి బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ నివాసులు వృత్తి రీత్యా బెంగుళూరులో నివాసం ఉంటున్న సంయుక్త సేవాసంస్థ సభ్యులైన ఎమ్.క్రిష్ణ కిశోర్ - అనూష దంపతుల కుమార్తె చిన్నారి తన్మయి పుట్టినరోజు సందర్భంగా శనివారం కావలి పట్టణం పిజి కాలేజీ దగ్గర నివసిస్తున్న వికలాంగులు ఆదెమ్మ, అనసూయమ్మలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. అనంతరం సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు స్వీట్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు విశ్రాంత లెక్చరర్, ఎమ్.వి.ఎన్ ప్రసాదరావు, అడ్వకేట్ మల్లి, సూర్య, నారాయణ పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించే గడువు పొడిగించారని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కావలి తాలూకా అధ్యక్షులు ఆకుల రమణయ్య తెలిపారు. మార్చి 25వ తేదీ గానీ లేదా బిల్లులు వచ్చే లోపు గానీ ఏది ముందైతే ఆ లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ వారు సూచనలు చేశారన్నారు. కావున కావలి ట్రెజరీ పరిధిలోని ఇంకనూ సమర్పించని సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను గడువు లోపు ట్రెజరీ కార్యాలయంలో సమర్పించు కోవచ్చన్నారు.

'ఎడిఎఫ్'తో అభివృద్ధిని కొనసాగిస్తాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఎడిఎఫ్)తో నియోజకవర్గంలో అభివృద్ధిని కొనసాగిస్తామని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్ల, ఆరవీడు, ఆరవీడు జంగాలపల్లి, గొల్లపల్లి, బోయలచిరువెళ్ల గ్రామాల్లో శనివారం విజయీభవయాత్రను నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయంలో ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న సాధారణ ఎన్నికల్లో తోడుగా ఉండి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలబడాలన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వస్తేనే ప్రజాసంక్షేమ పథకాలు అమలవుతాయని, ప్రజలందరూ గుర్తించుకోవాలన్నారు. ఇప్పటి వరకు జగనన్న ఆరవీడు గ్రామాభివృద్ధికి రూ.8.43కోట్లు అందజేశామన్నారు. ఇందులో డిబిటి ద్వారా 2246 మందికి, నాన్ డిబిటి ద్వారా 859 మందిక లబ్ధి చేకూరిందని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న సమయంలో గ్రామస్తులు తమ దృష్టికి అధికంగా రెవెన్యూ సమస్యలు తీసుకొచ్చారని, జగనన్న తెచ్చిన సంస్కరణలు జిల్లా కలెక్టర్‌తో జరిపిన చర్చలతో ఆరవీడు గ్రామంలో 143మంది రైతులకు 340 ఎకరాల్లో సమస్య పరిష్కారమైందన్నారు. రానున్న రోజుల్లో చేయబోయే అభివృద్ధిని కూడా ప్రజలకు వివరించి వాటిని తప్పక పూర్తి చేస్తామని హామీనిస్తున్నామని తెలిపారు. ఉత్తరకాలువ ద్వారా చెరువులకు నీళ్లు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు కావడం జరిగిందని, రానున్న రెండేళ్ల కాలంలో వీటిని పూర్తి చేసి మీ చెరువులన్నింటికీ సాగునీరు అందించేలా కృషి చేస్తామన్నారు. ఇంకా గ్రామంలో అవసరమైన సిమెంటు రోడ్లు, గ్రావెల్ రోడ్డు, సైడు కాలువలు పనులన్నింటినీ పూర్తి చేస్తామని వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రభుత్వ సహకారానికి తోడు ప్రయివేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసుకునే విధంగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఇప్పటి వరకు రూ.20కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు. ఆరవీడు గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతామన్నారు. అంతేకాక ప్రతి 10 పంచాయతీలకు కలిపి ఒక కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా బోయలచిరువెళ్లలో సంక్షేమాభివృద్ధి కోసం రూ.15.2 కోట్లు మంజూరు చేశామన్నారు. 232మంది రైతన్నల భూసమస్యలను పరిష్కరించామని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.30లక్షలతో అభివృద్ధి పనులను నిర్వహించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామస్తులు, రైతులు, ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన పనులను తప్పక పూర్తి చేస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా గ్రామ మేనిఫెస్టోను గ్రామంలోనే ఏర్పాటు చేసి వాటన్నింటినీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మే 13న ఎన్నికలు జరగనున్నాయని, మీ సంక్షేమానికి, మీ కుటుంబ ఆర్థిక ప్రగతి కోసం ఎన్నో సార్లు బటన్ నొక్కిన జగన్నన కోసం రానున్న ఎన్నికల్లో ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులకు రెండు బటన్లు నొక్కి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, మండల రూరల్ కన్వీనర్ చిట్టమూరు జితేంద్ర నాగ్‌రెడ్డి, జెడ్‌పిటిసి పెమ్మసాయన ప్రసన్నలక్ష్మి, ఆరవీడు సర్పంచి ప్రసాద్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జీ గారి కోర్టులో..

E.P.NO.96/2022
O.S.NO.230/2021

రూపినేని మాల్యాద్రి - డి. హెచ్. ఆర్.
V/s
కందునూల రవీంద్ర - జె. డి. ఆర్.

వేలం ప్రకటన

పై నెంబర్ ఇ.పి.లో ఈ క్రింది షెడ్యూల్ దాఖలా తాలూకా జె.డి.ఆర్. స్థిరాస్తిని శ్రీ కోర్టు వారు **తే18-03-2024**దిన **ఉదయం గం.10-30 నిముషముల** నుండి బహిరంగ వేలం జరుపుదురు. కావున ఆసక్తి గల వారు పై తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై క్రింది షెడ్యూలు ఆస్థిని వేలం పాటలో పాడుకోవచ్చునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా, పాత ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్‌రిజిస్ట్రేషన్ వలేటివారిపాలెం మండలం, వలేటివారిపాలెం గ్రామ సర్వే నెంబర్ 343/F విస్తీర్ణం య.1-15 సెంట్లు, సర్వే నెంబర్ 343/E విస్తీర్ణం య.1-15 సెంట్లు, సర్వేనెంబర్ 343/C విస్తీర్ణం య.1-73 సెంట్లు కంటిన్యూస్ ప్లాటు మొత్తం విస్తీర్ణం య.4-02 సెంట్లకు **హద్దులు :-**

తూర్పు :- ఈర్ల తిరుపతయ్య గారి భూమి
దక్షిణం :- హనుమంతరావు గారి భూమి
పడమర :- వలేటి ఆంజనేయులు గారి భూమి
ఉత్తరం :- మితుకుల మాలకొండయ్య గారి భూమి

పై 4 హద్దులలోని య. 4.02సెంట్లు విస్తీర్ణం గల కంటిన్యూస్ ప్లాటుకు రాకపోకల హక్కులతో సహా,

డి. హెచ్. ఆర్. విలువ :- రూ.6,00,000/-
అమీనా విలువ :- రూ.12,00,000/-
మార్కెట్ విలువ :- రూ.6.87,420/-
వేలం తేదీ : - 18-03-2024

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
డి. హెచ్. ఆర్. తరపు అడ్వకేట్స్
కందుకూరు.

సిఎఎ అమలును వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-కావలి

"రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన, కొత్త పౌరసత్వ చట్టం సిఎఎను అమల్లోకి తేకుండా ప్రజలందరూ వ్యతిరేకించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి 2014 నుండి రెండు పర్యాయాలు కేంద్ర పీఠాన్ని అధిష్ఠించి, దేశంలో హిందూత్వ - మను ధర్మశాస్త్రం ప్రకారం అనేక విధాలుగా పాటిస్తూ దేశంలోని ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, బౌద్ధ మతస్తులను వివక్షతో చూస్తూ దళిత, బడుగు, బలహీనవర్గాలు, మహిళలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించి అమలు పరచబడుతున్న భారత రాజ్యాంగ మిచ్చిన మత స్వాతంత్ర్యపు ప్రాథమిక హక్కును కాలరాస్తూ , హిందూత్వాన్ని నిరంకుశంగా వ్యాప్తిచేసే పలు దుర్మార్గపు విధానాలతో పదేళ్లుగా దేశాన్ని అధోగతి పాలుచేసి, హిట్లర్ ముస్సోలినీ నియంతల బాట నడుస్తున్న బిజెపి కొత్తగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తెస్తున్న సిటిజెన్ ఆమెండమెంట్ ఆక్ట్, సిఎఎ అనే కొత్త పౌరసత్వ చట్టాన్ని అమలులోకి రాకుండా యావత్ భారతదేశ ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి వారు, మహిళలు సమైక్య పోరాటం జరపాలన్నారు.

పౌరసత్వ సవరణ 2019 ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల నుండి వచ్చిన కాందిశీకులకు ఈ పౌరసత్వ సవరణ చట్టం వర్తించదని, ఎన్నికలకు ముందు సిఎఎ చట్టంతో ప్రభుత్వం నోటిఫై చేసిందన్నారు. ఇతర దేశాల నుండి భారతదేశానికి వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం ఇస్తారని దీనర్థమన్నారు. ఇది బిజెపి ప్రభుత్వానికి ముస్లిములపై ఎంత తీవ్ర వివక్ష ఉన్నదో అర్థమవుతుందన్నారు. భారత ప్రభుత్వం నాడు ఆమోదిస్తేనే, ఇతర దేశాల నుండి హిందూయేతర శరణార్థులు, ఆయాదేశాల్లో ప్రాణరక్షణ లేక మన దేశంలోకి వచ్చి ఏళ్లతరబడి ఉంటున్నారు. ఈ సిఎఎ పౌరసత్వ నోటిఫికేషన్ చట్ట రూపంలోకి వచ్చిన అమలు జరపబోమని ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడులతోపాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు సిఎఎను అమలు జరపబోమని వ్యతిరేకించాయని తెలిపారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం నుండే మన దేశంలో ఉండటమేగాక, జాతీయోద్యమంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిన ముస్లిం దేశభక్తులెందరో ఈ భారతదేశంలో ఉన్నారని తెలియజేశారు. పలురాష్ట్ర ప్రభుత్వాలు బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నా, మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలు సిఎఎను, బిజెపిని వ్యతిరేకించకుండా నోరెత్తకపోవడం తీవ్ర విచారకర మన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, బిజెపికి మద్దతిచ్చే పార్టీలను ఓడించడం ప్రతి పౌరుడి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. నెత్తికి ముంపు ముంచుకొచ్చే దాకా మౌనం పనికిరాదని, ప్రజాస్వామ్య వాదులు, రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ, విద్యావేత్తలు, ఉద్యోగులు, విద్యార్థి, మహిళా సంఘాలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఏకమై "జనజాగృతి" కలిగించే బాధ్యతను చేపట్టి, పౌరుల మధ్య మత కల్లోలాలను రెచ్చగొట్టే సిఎఎను వ్యతిరేకిస్తూ, దానిని తెస్తానంటున్న బిజెపిని, బిజెపికి వత్తాసు పలికే పార్టీలను 2024లో జరిగే ఎన్నికల్లో ఓడించాలన్నారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని, మత వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు సి.శారద, టి.సుజాత, ఎస్‌కె.నూర్జహాన్, ఎస్‌కె.ఫాతిమా, అనూరాధ, మనోజ, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగుండాలి

ప్రజాశక్తి-సంగం

సంగం జెడ్‌పి హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య టెలిస్కోప్ ద్వారా విద్యార్థులకు ఆకాశ దర్శనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ మ్యూజియం క్యూరేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొని విద్యార్థులకు టెలిస్కోప్ ద్వారా చంద్రుని దర్శనం చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చంద్రుని యొక్క విశేషాలను తెలియజేస్తూ అవగాహనా కల్పించారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి వుండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయిని జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జితేంద్ర నాథ్ శర్మ (ఐఎఎస్), సీనియర్ ఆడిట్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి విరుపావఝ్ఝుల గిరికృష్ణ అతిథులకు ప్రత్యేక దర్శనం కల్పించి శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల శేష వస్త్రములు బహూకరించి తీర్థ ప్రసాదములు అందజేశారు.

కవాతు నిర్వహిస్తున్న ఫోర్స్

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-సంగం

సంగంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్, ఎస్ఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పారా మిలిటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామంలో విధివీధిన తిరిగి ప్రజలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని కోరారు.

విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు డెస్క్

మండలంలోని లేబూరు గ్రామంలో శనివారం సిపిఎం నేతలు ప్రజల వద్ద నుంచి విరాళాలు సేకరించారు. శనివారం సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిపిఎం నేతలు ప్రజా విరాళాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు సిపిఎం పార్టీకి విరాళాలు స్వచ్ఛందంగా ఇచ్చి సిపిఎం ఉద్యమాలకి అండగా నిలవాలన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజా సమస్యలపై గళం వినిపిస్తూ ప్రజలకు అండగా సిపిఎం ఉంటుందని తెలిపారు. మండలంలోని అనేక సమస్యల పరిష్కారానికి పోరాడిన సంఘటన లను ప్రజలకు గుర్తుచేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు తిక్కవరపు ప్రభాకర్ రెడ్డి, సిపిఎం నేతలు కందాటి రవీంద్ర, మాల్యాద్రి, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి

ప్రజాశక్తి-కావలి

దుర్మార్గపు పాలన నుండి రాష్ట్ర ప్రజలకు నేటితో విముక్తి లభించిందని కావలి టిడిపి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయం వద్ద టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విలేఖరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడంతో ఇక రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. గడిచిన 5 సంవత్సరాల దుష్టపాలన నుండి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ఈ వైసిపి అరాచకాలు ఇక సాగవని, ప్రజలు అందరూ ధైర్యంగా బయటకు రావాలన్నారు. మరో 60రోజుల్లో పూర్తి స్వేచ్ఛ వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ ఇంటికి పంపటానికి సిద్ధంగా ఉన్నారని, జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన 28 పథకాలు, బిసిలకు చెందిన 30 పథకాలు, మైనారిటీలకు చెందిన 11 పథకాలను రద్దు చేసి వందలాది మందిపై మారణహోమం సృష్టించిన జగన్ రెడ్డి పాలనకు ముగింపు పలికే సమయం ఈరోజుతో మొదలైందన్నారు. ఐదేళ్ల మేనిఫెస్టోలో 30 శాతం హామీలను కూడా అమలు చేయకుండా, అన్ని వర్గాల వారిని వంచించిన జగన్ రెడ్డిని శాశ్వతంగా రాజకీయ సమాధి చేయడం ఖాయమన్నారు. జగన్ రెడ్డికి ఓటు వేయొద్దని రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లెలు చెబుతున్నారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాకుండా ఈ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన మండల పార్టీ కన్వీనర్లు, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జులు, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జులతో వైసిపి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయి రెడ్డి ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నిర్వహించడానికి ముందు శ్రీ విజయసాయి రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన తూర్పు రాయలసీమ శాసనమండలి సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని అనుకోని సందర్భంగా బాగుందని విజయసాయి రెడ్డి జిల్లా అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గౌరవ పెద్దలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, స్థానిక నాయకులతో చర్చించి పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపడతానని తెలియజేశారు. అందరితో కలిసిమెలిసి పని చేస్తానని, జిల్లా అధ్యక్ష స్థానాన్ని పదవిలా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తానని తెలిపారు. గౌరవ పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం, పార్టీ కేంద్ర కార్యాలయ ఆదేశాల ప్రకారం జిల్లాలో పార్టీని బలోపేతం చేసే దిశగా కేంద్ర కార్యాలయానికి, జిల్లాస్థాయి, మండల స్థాయి నాయకులకు మధ్య వారధిగా ఉండి స్థానిక నాయకులకు కార్యకర్తలకు సహాయ సహకారాలు అందిస్తూ పనిచేస్తానని తెలిపారు. త్వరలో జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, మండల స్థాయి నాయకులను కలుస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష బాధ్యతల నిర్వహణలో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విజయవంతం కావాలని, జిల్లాలో పార్టీని ఏకతాటిపై నడిపి నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలతో పాటు సర్వేపల్లి నియోజకవర్గంతో కలిపి 8/8 స్థానాలను, నెల్లూరు పార్లమెంటు స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు.

ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపి విజయసాయిరెడ్డి

విద్యార్థి చికిత్సకు వితరణ

ప్రజాశక్తి-కావలి

వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కాళ్ళ అనారోగ్యంతో బాధపడుతున్న పాఠశాల విద్యార్థి షేక్.సాదిక్ చికిత్స కోసం శనివారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ ద్వారా స్పందించి పాఠశాలలో సేకరించారు. రూ.17,110 వారి తల్లి షేక్ షాహినాకు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జి.అమరజ్యోతి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 6,7 తరగతుల విద్యార్థులు వెంటనే స్పందించిన తీరు వర్ణనాతీతమన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు స్పందించి అధిక మొత్తంలో ఇవ్వడం చాలా ఆనందదాయకమని తెలియజేస్తూ బాల్య దశ నుంచే ఇలాంటి సేవాగుణం అలవరచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.అమరజ్యోతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఇలా సమాజంలో ప్రతిఒక్కరూ దాతలుగా స్పందించితే సకల మానవాళి సంతోషదాయకమని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు / దాతలు బి.శ్వరణి, కె.ఎస్.అంజాద్ అలీ, ఐ.శ్రీనివాసులు, షేక్ సాబిరా బేగం, ఏ.శ్రీలక్ష్మీవై రజని, కె.విజయలక్ష్మీ, బి.సుమనా, ఎ వి సుబ్బయ్య, షేక్ మహబూబ్ మస్తాన్, కె.జయప్రకాశ్, టి.కనకలక్ష్మి, జి.మారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది